


నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి
నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ,
మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా
పని చేయుటకు ఆసక్తి, అనుభవం
ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్
చేసి సంప్రదించగలరు.

Contact Number
9059328777

ఆంధ్రప్రదేశ్ (క్రిష్ణ) | బుధవారం 15-07-2026 సంపుటి: 01 సంచిక : 11 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Andhrapradesh(Krishna) Wednesday 15-07-2026 Volume :01 Issue: 11 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani



## ఏపీలో 'సర్ ' గడువు పొడిగింపు

- ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) గడువు పొడిగింపు
- ఈ నెల 24 వరకు పెంచుతూ ఈసీఐ నిర్ణయం
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అభ్యర్థన మేరకు సవరించిన షెడ్యూల్ విడుదల
- ఇప్పటివరకు 88 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తి
- సవరణ ప్రక్రియలో 14 లక్షల మంది మరణించినట్లు..
- మరో 12 లక్షల మంది వలస వెళ్లినట్లు గుర్తింపు

**అమరావతి**

ఏపీలో ఓటర్ల జాబితాకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-సర్) ప్రక్రియ గడువును ఈ నెల 24వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. వాస్తవానికి ఈ గడువు మంగళవారంతో ముగియాల్సి ఉంది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఇంకా పూర్తికాకపోవడంతో గడువును పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) చేసిన విజ్ఞప్తికి ఈసీఐ సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు సవరించిన కొత్త షెడ్యూల్‌ను విడుదల చేసింది.

-మిగతా 2 లో



## అమ్మాయిల పెండ్లి వయసు 21కి పెంపు?

- కేంద్రం మరోసారి కసరత్తు
- 2027 జనాభా లెక్కల తర్వాతే తుది నిర్ణయానికి అవకాశం
- 23.1 ఏళ్లకు పెరిగిన మహిళల సగటు వివాహ వయసు
- పట్టణాల్లో 24.4.. గ్రామీణ ప్రాంతాల్లో 22.6 ఏళ్లకు పెళ్లిళ్లు
- ఉన్నత విద్య, ఉపాధితో ఆలస్యమవుతున్న వివాహాలు
- ఆలస్య వివాహాలతో తగ్గుతున్న సంతానోత్పత్తి రేటు
- తల్లి ఆరోగ్యం, జనాభా, ఉపాధి విధానాలపై కొత్త ఆలోచనలు


2లో

# చెప్పాం.. చేస్తున్నాం

### ఐదేళ్లూ విద్యుత్ చార్జీలు పెంచేది లేదు

- తొలిసారి ట్రూడౌన్ అమలు చేస్తున్నాం
- మార్చి 31కి పోలవరం తొలి దశ పూర్తి
- ఆగస్టు 14న ఎడమ కాలువ ద్వారా నీరు
- 36 ప్రాజెక్టులు ప్రాధాన్య క్రమంలో పూర్తి
- క్షేత్రస్థాయిలో పర్యటిస్తేనే వాస్తవాలు తెలిసేది
- పీఆర్‌జీఎస్‌తో 100శాతం సమస్యల పరిష్కారం
- ముఖ్యమంత్రి చంద్రబాబు దిశా నిర్దేశం
- మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌ఓడీలతో భేటీ
- ఉద్యోగులు, అధికారులకు అభినందనలు
- ఉన్నతస్థానాల్లో ఉన్న కొందరు అభివృద్ధి నిరోధకులుగా ఉన్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు


**నెలవారీ ఆర్థిక నివేదికలతో మరింత అభివృద్ధి**



**అమరావతి,**

"ప్రజల సమస్యలు, వాస్తవాలు తెలియాలంటే ఉన్నతస్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లాలి. వినూత్న ఆలోచనలతో సుపరిపాలనను ప్రజలకు అందించాలి" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మంత్రులు, కార్యదర్శులు, విభాగాల అధిపతులతో (హెచ్‌వోడీ) మంగళవారం సచివాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నెలవారీ ఆర్థిక నివేదికలపై సమీక్షించారు. "ఒక మంచి అధికారి సమస్యను పరిష్కరిస్తే... అద్భుతంగా పనిచేసే అధికారి అసలు సమస్యలనేవే తలెత్తకుండా చేస్తారు"... అనే కోణంలో పనితీరు కనబరచాలని సీఎం సూచించారు. "ప్రభుత్వం మూడో ఏడాదిలోకి అడుగు పెట్టినప్పటికీ విద్యుత్ చార్జీలు పెంచలేదు. ఐదేళ్లపాటు విద్యుత్ చార్జీలు పెంచేదిలేదని చెప్పిన మాటను నిలబెట్టుకున్నాం. ట్రూడౌన్‌ను కూడా

-మిగతా 2 లో



## పీవోకేలో రక్తసిక్తం..

- పాక్ రేంజర్ల కాల్పుల్లో 8 మంది నిరసనకారుల మృతి
- తీవ్రంగా ఖండించిన భారత్
- ముజఫరాబాద్ ర్యాలీకి ముందు రావల్‌కోట్‌లో కాల్పుల కలకలం
- మహిళలు, ఆందోళనకారులపై భద్రతా బలగాల దాడి
- పీవోకేలో మానవ హక్కుల ఉల్లంఘనలపై భారత్ ఆగ్రహం
- దశాబ్దాలుగా అణచివేతకు పాల్పడుతోందని ఇస్లామాబాద్‌పై ఆరోపణ

2 లో

## 60 రోజులపాటు యుద్ధం?

- కాంగ్రెస్‌కు ట్రంప్ అధికారిక నోటీసు



2 లో




## వాణిజ్య నౌకలపై దాడులు ఆపాలి

- హార్ముజ్ లో దాడులపై భారత్ సీరియస్
- పశ్చిమాసియాలో మళ్లీ ముదురుతున్న యుద్ధం
- హార్ముజ్ లో ప్రయాణిస్తున్న యూఏఈకి చెందిన రెండు నౌకలపై ఇరాన్ దాడి
- ఈ ఘటనలో ఒక భారతీయ నావికుడు మరణం

**న్యూఢిల్లీ**

హార్ముజ్ జలసంధి వంటి అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో వాణిజ్య నౌకల రాకపోకలకు ఆటంకం కలిగించడాన్ని, అందులోని సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ జరిపిన దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు నౌకలపై జరిగిన దాడులపై తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయానికి చెందిన డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ (డీసీఎం) మహమ్మద్ జావాద్ హొస్సేనీను భారత విదేశాంగ శాఖ పిలిపించిన వెంటనే ఈ అధికారిక ప్రకటన వెలువడింది.

-మిగతా 2 లో




## పాఠశాలలు, కళాశాలల్లో లైంగిక విద్యకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- సుప్రీంకోర్టుకు ప్రభుత్వ నిర్ణయం వెల్లడి
- 'సేఫ్ టచ్--అన్‌సేఫ్ టచ్'పై చిన్నారులకు అవగాహన
- పాఠ్యాంశాల్లో లైంగిక ఆరోగ్యం, భద్రతకు చోటు
- జాతీయ నిపుణుల కమిటీ కీలక సిఫార్సులకు ఆమోదం
- పోక్సో కేసుల నేపథ్యంలో సంస్కరణలపై దృష్టి
- వయస్సుకు తగిన లైంగిక విద్య బోధనకు కార్యాచరణ

**న్యూఢిల్లీ,**

దేశంలోని అన్ని పాఠశాలలు, కళాశాలల్లో 'సమగ్ర లైంగిక విద్య' ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు సోమవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులను ప్రభుత్వం ఆమోదించిందని, కోర్టు అనుమతి లభించిన వెంటనే అమలు ప్రక్రియ ప్రారంభిస్తామని కేంద్రం వెల్లడించింది. జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఆర్ మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం ముందు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి ఈ విషయాన్ని వెల్లడించారు. కమిటీ సమర్పించిన నివేదికను ప్రభుత్వం అంగీకరించిందని, దేశవ్యాప్తంగా అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

-మిగతా 2 లో

## అబద్ధాల పునాదులపై పుట్టిందే గొడ్డలి పార్టీ

### మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు



- వైసీపీ హయాంలో 277 మంది మత్స్యకారులు మృతిచెందినా ఒక్కరిని కూడా పరామర్శించలేదు
- రూ. 10 లక్షల సాయాన్ని 'ముష్టి' అనడం జగన్ అవినీతి మనస్తత్వానికి నిదర్శనం
- 10 నాటికల్ మైల్స్‌ను 10 కిలోమీటర్లుగా చెప్పడం జగన్ అజ్ఞానానికి ప్రతీక
- అభివృద్ధిపై ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధం
- అబద్ధాల ప్రచారంతో రాజకీయాలు చేయడం వైసీపీ నైజం: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి**

అబద్ధాలు, అసత్య ప్రచారంతో రాజకీయాలు చేయడం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నైజమని, ఆ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్. జగన్మోహన్ రెడ్డికి మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు లేదని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విమర్శించారు. మంగళవారం సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్నం పర్యటనను ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసం జగన్మోహన్ రెడ్డి వినియోగించుకున్నారని మంత్రి ఆరోపించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ప్రతిపక్ష నేత మరోసారి ప్రజలను

-మిగతా 2 లో



## షేక్ హసీనా ఢాకాకు తిరిగి వస్తే జైలుకే

- షేక్ హసీనా ఢాకాకు తిరిగి రావడంపై స్పందించిన బంగ్లాదేశ్ మంత్రి
- స్వదేశానికి తిరిగొస్తే చట్టప్రకారమే చర్యలు తీసుకుంటాం
- హసీనాపై న్యాయ ప్రక్రియ కొనసాగుతుందన్న ఢాకా
- అవామీ లీగ్‌కు ధైర్యం చెప్పేందుకే హసీనా వ్యాఖ్యలు?
- అప్పగింత కోసం భారత్‌కు మరోసారి ఢాకా విజ్ఞప్తి

**ఢాకా:**

బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఢాకాకు తిరిగి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఆమె తిరిగి రావడంపై బంగ్లాదేశ్ మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. షేక్ హసీనా తిరిగి బంగ్లాదేశ్ కు వస్తే చట్ట ప్రకారం అరెస్ట్ చేసి జైలుకు పంపుతామని ఆ దేశ విదేశాంగ శాఖ సహాయ మంత్రి శామా ఒబైద్ ఇస్లాం స్పష్టం చేశారు. హసీనా ఎక్కడ లొంగిపోయినా, బంగ్లాదేశ్ లో అడుగుపెట్టిన వెంటనే చట్టపరమైన ప్రక్రియ అమలవుతుందని పేర్కొన్నారు. హసీనా లొంగిపోతే ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాల ప్రకారమే చర్యలు తీసుకుంటామని శామా ఒబైద్ తెలిపారు. చట్టం తన పని తాను చేసుకుంటుందని అన్నారు. ఆమె ఇప్పటికే కోర్టుల్లో దోషిగా తేలిన వ్యక్తి, అందుకే ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణించాల్సిన అవసరమే లేదన్నారు. భారత్ లో లేదా బంగ్లాదేశ్ లో లొంగిపోయినా ముందుగా జైలుకు వెళ్లాల్సిందేనని స్పష్టం చేశారు. హసీనా బంగ్లాదేశ్ కు తిరిగి వచ్చిన తర్వాత చట్టపరమైన ప్రక్రియ ఏ విధంగా ముందుకు సాగాలనే అంశాన్ని న్యాయవ్యవస్థే నిర్ణయిస్తుందని మంత్రి చెప్పారు.

-మిగతా 2లో



## కాపు నేత ముద్రగడ కన్నుమూత

- కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచిన నేత
- కాపు ఉద్యమ నేతగా రాష్ట్ర రాజకీయాల్లో బలమైన ముద్ర

**అమరావతి**

మాజీ మంత్రి, వైకాపా నేత ముద్రగడ పద్మనాభం (73) కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. గతకొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని సింధు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం సాయంత్రం తుది శ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో, ముఖ్యంగా కాపు సామాజికవర్గ ఉద్యమాల్లో అత్యంత కీలక నేతగా గుర్తింపు పొందిన ముద్రగడ పద్మనాభం పేరు వినబడగానే అందరికీ గుర్తొచ్చేది కాపు ఐక్య గర్జన

-మిగతా 2 లో

RNI NO: TGTEL/25/A0471
తెలుగు దిన పత్రిక

# అమ్మాయిల పెండ్లి వయసు 21కి పెంపు?

- కేంద్రం మరోసారి కసరత్తు
- 2027 జనాభా లెక్కల తర్వాతే తుది నిర్ణయానికి అవకాశం
- 23.1 ఏళ్లకు పెరిగిన మహిళల సగటు వివాహ వయసు
- పట్టణాల్లో 24.4.. గ్రామీణ ప్రాంతాల్లో 22.6 ఏళ్లకు పెళ్లిళ్లు
- ఉన్నత విద్య, ఉపాధితో ఆలస్యమవుతున్న వివాహాలు
- ఆలస్య వివాహాలతో తగ్గుతున్న సంతానోత్పత్తి రేటు
- తల్లి ఆరోగ్యం, జనాభా, ఉపాధి విధానాలపై కొత్త ఆలోచనలు



న్యూఢిల్లీ,
భారతదేశంలో మహిళల సగటు వివాహ వయసు 19.3 ఏండ్ల నుండి 23.1 ఏండ్లకు పెరిగిందని శాంపిల్ రిజిస్ట్రేషన్ సర్వే(ఎస్ఆర్ఎస్), నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే(ఎస్ఎఫ్‌హెచ్ఎస్) నివేదిక పేర్కొంది. ప్రస్తుతం మహిలలు సాధారణంగా పట్టణ ప్రాంతాల్లో సగటున 24.4 ఏండ్ల వయసులో, గ్రామీణ ప్రాంతాల్లో 22.6 ఏండ్ల వయసులో వివాహం చేసుకుంటున్నారని నివేదిక తెలిపింది. మహిళల చట్టపరమైన వివాహ వయసును 21 ఏండ్లకు పెంచేందుకు ప్రభుత్వం 2021లో ఒక బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. అయితే లోక్‌సభ రద్దు కావడంతో దానికి కాలదోషం పట్టింది. ఇప్పుడు ఈ విషయమై 2027 జనాభా లెక్కల తర్వాత తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. మహిళల వివాహ వయసు పెరగడానికి వెనుక ఉన్న కారణాలు జనగణన ద్వారా అంచనా వేయడానికి వీలు ఏర్పడుతుంది. ఉన్నత విద్యా వివాహాన్ని ఆలస్యం చేస్తోందా, ఆలస్య వివాహం సంతానోత్పత్తిని తగ్గిస్తోందా, ఇంటి ఖర్చులు, నిరుద్యోగం, వలసలు వంటివి దోహదపడుతున్నాయా వంటి విషయాలపై అధ్యయనం చేయడం వల్ల మహిళల వివాహం జాప్యానికి కారణాలు తెలిసే అవకాశం ఉంది. ఆలస్యంగా వివాహం చేసుకోవడం, జనన రేట్లు తగ్గడం వంటి తూర్పు ఆసియా తరహా ధోరణులను భారత్ ఇప్పుడు చూస్తోంది. జనాభా, విద్య, తల్లి ఆరోగ్యం, ఉపాధి వంటి అంశాలలో విధానపరమైన మార్పులు అవసరం.

**పెండ్లికి, సంతానోత్పత్తికి సంబంధం?**
భారతదేశంలో మొత్తం సంతానోత్పత్తి రేటు(టీఎఫ్ఆర్) 1.9కి తగ్గింది. ఇందులోపట్టణ ప్రాంతాల్లో 1.5గా. గ్రామీణ ప్రాంతాల్లో 2.1గా ఉంది. మహిళలు ఆలస్యంగా వివాహం చేసుకోవడం వల్ల వారి సంతానోత్పత్తి కాలం తగ్గి తద్వారా జనన రేట్లు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. దేశంలో 10-14 సంవత్సరాల వయసు ఉన్న పిల్లల జనాభా 24 శాతం తగ్గింది. పనిచేయగల వయసు గల జనాభా 66.4 శాతానికి పెరిగింది. ప్రస్తుతం 6. ఏండ్లు, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న వారు జనాభాలో 9.7 శాతం మందిగా ఉన్నారు.

# 60 రోజులపాటు యుద్ధం?

## కాంగ్రెస్‌కు ట్రంప్ అధికారిక నోటీసు



వాషింగ్టన్,
ఇరాన్‌పై జూలై 7న మళ్లీ యుద్ధం ప్రారంభమైనట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికన్ కాంగ్రెస్‌కు ఒక అధికారిక నోటిఫికేషన్ పంపించారు. కాంగ్రెస్ ఆమోదం లేకుండానే ఆ ప్రాంతంలో సైన్యాన్ని వినియోగించడానికి 60 రోజుల పాటు కొత్త అవకాశాన్ని పొందడమే ఈ లేఖ ఉద్దేశంగా కనిపిస్తోంది. అమెరికన్లను, అలాగే అమెరికా జాతీయ భద్రత, విదేశాంగ విధాన ప్రయోజనాలను రక్షించాల్సిన నా బాధ్యతకు అనుగుణంగానే నేను ఈ సైనిక చర్యను చేపట్టాను అని ఆ లేఖలో ట్రంప్ పేర్కొన్నారు. ఏప్రిల్ 7న తాను జారీచేసిన రెండు వారాల కాల్పుల విరమణ, దాన్ని పొడిగించడం, యుద్ధానికి ఒక దౌత్యపరమైన పరిష్కారాన్ని కనుగొనేందుకు తన ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆ లేఖలో ట్రంప్ పేర్కొన్నారు. జూన్ 17న ఇరాన్‌తో కుదుర్చుకున్న అవగాహనా ఒప్పందాన్ని ప్రస్తావిస్తూ హొర్ముజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై దాడి చేయడం ద్వారా ఇరాన్ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ట్రంప్ పేర్కొన్నారు. దీంతో ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభించక తప్పలేదని ఆయన తెలిపారు. ఘర్షణ తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో గల్ఫ్‌లో ఇరాన్ నౌకా రవాణాపై అమెరికా తన దిగ్బంధనాన్ని పునరుద్ధరిస్తోందని, అలాగే హొర్ముజ్ జలసంధి తెరిచి ఉండేలా చూస్తుందని ట్రంప్ తన లేఖలో పేర్కొన్నారు. యుద్ధాన్ని ప్రకటించే అధికారం కేవలం కాంగ్రెస్‌కు మాత్రమే ఉంటుందని, అధ్యక్షుడికి కాదని అమెరికా రాజ్యాంగం పేర్కొంటోంది. అయితే అమెరికా భద్రతను కాపాడేందుకు చట్టసభల ఆమోదం లేకుండానే స్వల్పకాలిక సైనిక చర్యలను చేపట్టే అధికారం తమకు ఉందని అమెరికా అధ్యక్షులు చాలా కాలంగా వాదిస్తూ వస్తున్నారు.

# పీవోకేలో రక్తసిక్తం..

-పాక్ రేంజర్ల కాల్పుల్లో 8 మంది నిరసనకారుల మృతి
-తీవ్రంగా ఖండించిన భారత్
-ముజఫరాబాద్ ర్యాలీకి ముందు రావల్‌కోట్‌లో కాల్పుల కలకలం
-మహిళలు, ఆందోళనకారులపై భద్రతా బలగాల దాడి
-పీవోకేలో మానవ హక్కుల ఉల్లంఘనలపై భారత్ ఆగ్రహం
-దశాబ్దాలుగా అణచివేతకు పాల్పడుతోందని ఇస్లామాబాద్‌పై ఆరోపణ



ముజఫరాబాద్,
పాకిస్థాన్ రేంజర్స్ జరిపిన కాల్పుల్లో 8 మంది నిరసనకారులు మృతి చెందడంతో పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో సోమవారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసనకారులు ఈ ప్రాంత రాజధాని ముజఫరాబాద్‌కు ఈ నెల 15న భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రావల్‌కోట్ బస్ స్టాండ్‌లో పెద్దయెత్తున గుమిగూడిన మహిళలు, ఆందోళనకారులను లక్ష్యంగా చేసుకుని పాక్ భద్రతా బలగాలు కాల్పులు జరిపాయి. పాక్ రేంజర్లు వారిపై టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగించడంతో పాటు కాల్పులు కూడా జరిపారు. కాగా, ఈ ఘటన జరగడానికి ఒక రోజు ముందు అమెరికాలో నివసిస్తున్న పీవోకే ప్రవాసీయులు వాషింగ్టన్‌లోని శ్వేత సౌధం ముందు నిరసన తెలిపారు.తమ ప్రాంతంలో రోజురోజుకు తీవ్రమవుతున్న మానవతా సంక్షోభంలో అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకోవాలని వారు కోరారు. సుమారు వంద మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో పీవోకేలోని పౌర నివాస ప్రాంతాల్లో మోహరించి ఉన్న పాకిస్థాన్ బలగాలను వెంటనే ఉపసంహరించుకునేలా ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో కొనసాగుతున్న నిరసనలపై మంగళవారం పాక్‌ను భారత్ తీవ్రంగా విమర్శించింది. ఆ ప్రాంతంలో దశాబ్దాలుగా ఇస్లామాబాద్ వ్యవస్థాగత దోపిడీకి, ప్రాథమిక హక్కుల నిరాకరణకు, పరిపాలనా అణచివేతకు పాల్పడుతున్నదని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో ఆరోపించింది.

**పీవోకే మంగ్లా డ్యామ్‌లో ఉగ్రవాదులకు శిక్షణ**
పాక్ ఆక్రమిత జమ్ము కశ్మీరు(పీవోకే)లోని మంగ్లా డ్యామ్‌లో ఉగ్రవాద సంస్థ లష్కరే తాయిబా ఉగ్రవాదులు జలమార్గం ద్వారా చేపట్టే కార్యకలాపాల కోసం శిక్షణ పొందుతున్న దృశ్యాలతో కూడిన ఒక కొత్త వీడియో వెలుగులోకి వచ్చింది. లష్కరేకి చెందిన సభ్యులు ఈత కొడుతున్నట్లు, నీటికి సంబంధించిన శిక్షణ పొందుతున్నట్లు ఆ వీడియోలో కనిపించింది. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసిన నేపథ్యంలో ఉగ్రవాదిగా అమెరికా గుర్తించిన హారిస్ దార్ కొత్తగా ఉగ్రవాద సభ్యులుగా చేరిన వారితో మాట్లాడుతూ ఈ ఏడాది ఏదో ఒక పెద్ద సంఘటన జరగబోతోంది అన్నట్లుగా ఉన్న ఒక వీడియో గతవారం బయటకు వచ్చింది.

# వాణిజ్య నౌకలపై దాడులు ఆపాలి

మొదటి తరువాయి

కాగా, ఒమన్ తీరంలో ప్రయాణిస్తున్న యూఏఈకి చెందిన రెండు చమురు ట్యాంకర్లపై ఇరాన్ క్షిపణులతో దాడి చేయగా, ఈ ఘటనలో ఒక భారతీయ నావికుడు మృతి చెందాడు. పలువురు గాయపడ్డారు. అనంతరం భారత విదేశాంగ శాఖ కీలక ప్రకటన చేసింది.
సముద్ర మార్గాల్లో దాడులు పునర్ ప్రారంభం కావడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడంపై భారత విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పశ్చిమాసియాలో ప్రశాంతత, భద్రత, స్థిరత్వాన్ని కాపాడేందుకు శత్రుత్వాలకు తక్షణమే ముగింపు పలకాలని పిలుపునిచ్చింది. అలాగే శాంతి కోసం చర్చలు, దౌత్యపరమైన సంప్రదింపులు జరపాలని కోరింది. అంతర్జాతీయ చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా ప్రపంచ నౌకాయన మార్గాల్లో అడ్డంకులు లేని రాకపోకలు, సముద్ర వాణిజ్యాన్ని త్వరగా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేసింది. పశ్చిమాసియాలోని వాణిజ్య నౌకలు, సైనికేతర కేంద్రాలపై దాడులు ఆగిపోవాలని పేర్కొంది.

**'క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమం'**
ఒమన్ తీరంలో అల్ బాహియా, మొంబాసా అనే పేరు గల రెండు నౌకలపై జరిగిన దాడుల పట్ల భారత్ తీవ్ర ఆందోళన చెందుతోందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఈ రెండు నౌకల్లో మొత్తం 46 మంది సిబ్బంది ఉండగా, వారిలో 30 మంది భారతీయులేనని తెలిపారు. అల్ బాహియాలో పనిచేస్తున్న 12 మంది భారతీయులలో ఒకరు మరణించారని, మరొకరు గాయపడ్డారని పేర్కొన్నారు. మొంబాసాలో ఉన్న 18 మంది భారతీయుల్లో 9 మంది సిబ్బంది గాయపడ్డారని, వీరిలో ఇద్దరి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉందని వెల్లడించారు. అలాగే మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన సిబ్బంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.
"బాధిత భారతీయ నావికులకు అవసరమైన సహాయం అందేలా చూసేందుకు యూఏఈలోని ఇండియన్ ఎంబసీ, కాన్సులేట్ అక్కడి పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాయి. యూఏఈ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయి. హొర్ముజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు నౌకలపై జరిగిన క్షిపణి దాడిలో ఒక భారతీయ నావికుడు మరణించాడు. పలువురు గాయపడ్డారు. ఈ ఘటనపై తీవ్ర నిరసన తెలియజేయడానికి మంగళవారం ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ ను భారత్ పిలిపించింది. పశ్చిమాసియాలో జరుగుతున్న అన్ని పరిణామాలను మేము నిశితంగా గమనిస్తున్నాం. హొర్ముజ్ జలసంధి గుండా సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన నౌకాయనానికి, వాణిజ్యానికి మద్దతుగా మేము మా వైఖరిని స్థిరంగా కొనసాగిస్తున్నాం. ఎందుకంటే హొర్ముజ్ నౌకాయనం భారత్ కే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ఆర్థిక, ఇంధన భద్రతను కల్పించడంలో సహాయపడుతుంది" అని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

# ఏపీలో 'సర్' గడువు పొడిగింపు

మొదటి తరువాయి



గడువు పెంపునకు దారితీసిన కారణాలు
గత నెల రోజులుగా ఏపీ వ్యాప్తంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సరిచూసే ఎస్ఐఆర్ ప్రక్రియను చేపట్టారు. జులై 13 నాటికి దాదాపు 88 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ మాత్రమే పూర్తయింది. నిర్దేశిత గడువు సమీపిస్తున్నా ప్రక్రియ వంద శాతం పూర్తికాకపోవడంతో, గడువును పొడిగించాలని పలు రాజకీయ పార్టీలు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాను కోరాయి. పార్టీల విజ్ఞప్తులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న సీఈవో.. ఎస్ఐఆర్ ప్రక్రియను సమగ్రంగా పూర్తి చేసేందుకు మరింత సమయం అవసరమని పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ఈ అభ్యర్థనను పరిశీలించిన ఈసీఐ, గడువు పొడిగింపునకు అంగీకారం తెలిపింది.
సవరణలో వెల్లడైన కీలక గణాంకాలు
ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా బీఎల్‌ఓలు మొత్తం 4,16,26,144 ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. సోమవారం నాటికి 3,69,50,812 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశారు. ఈ ప్రక్రియలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 14,19,644 మంది ఓటర్లు మరణించినట్లు అధికారులు గుర్తించారు. అలాగే, ఉపాధి, వివాహం, ఇతర కారణాలతో 12,14,994 మంది ఓటర్లు తమ చిరునామా నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు తేలింది. బీఎల్‌ఓలు సర్వేకు వెళ్లిన సమయంలో 7,26,425 మంది ఓటర్లు ఇళ్ల వద్ద అందుబాటులో లేరని నివేదికలో పేర్కొన్నారు. ఇంకా 9 శాతానికి పైగా ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండటంతో, పొడిగించిన గడువులోగా వంద శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.
సవరించిన షెడ్యూల్ వివరాలు
కేంద్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియకు సంబంధించి సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. కొత్త షెడ్యూల్ ప్రకారం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన కీలక తేదీలను ప్రకటించింది. ఎస్ఐఆర్ ప్రక్రియను జులై 24లోపు పూర్తి చేయనున్నారు. అనంతరం జులై 31న ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రచురించనున్నారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, కొత్త చేర్పులు, మార్పుల కోసం జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అవకాశం కల్పించారు. అందిన అభ్యంతరాలు, దరఖాస్తుల పరిష్కారానికి సెప్టెంబరు 28 వరకు గడువు విధించారు. అన్ని ప్రక్రియలు పూర్తయిన అనంతరం అక్టోబరు 3న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా ప్రచురించనున్నారు. పొడిగించిన గడువుతో ఓటర్ల జాబితాను మరింత కచ్చితంగా, ఎలాంటి తప్పులు లేకుండా రూపొందించేందుకు అవకాశం లభిస్తుందని అధికారులు తెలిపారు. ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత పౌరులు తమ వివరాలను పరిశీలించుకుని, ఏవైనా మార్పులు లేదా అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులోగా తెలియజేయాలని ఎన్నికల సంఘం సూచించింది.

# చెప్పాం.. చేస్తున్నాం

మొదటి తరువాయి

అమలు చేస్తున్నాం. పట్టిసీమ నీటితో గోదావరి నుంచి కృష్ణా డెల్టా ఆయకట్టుకు నీరు అందించగలుగుతున్నాం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో జలసంరక్షణ కార్యక్రమాలు చక్కగా జరుగుతున్నాయన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టు మొదటి దశ పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని తెలిపారు. "ఆగస్టు 14న అనకాపల్లికి పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను విడుదల చేస్తాం. సెప్టెంబరు 1న వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను కూడా జాతికి అంకితం చేస్తాం. రాష్ట్రంలోని 36 ప్రాజెక్టులను ప్రాధాన్య క్రమంలో పూర్తిచేస్తాం" అని ప్రకటించారు. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములై సహకరిస్తున్న అధికారులు, ఉద్యోగులందరికీ అభినందనలు తెలిపారు. అదే సమయంలో... కీలకస్థానాల్లో పనిచేస్తున్న కొందరు అధికారులు అభివృద్ధి నిరోధకులుగా ఉన్నారని, ఇది సరికాదని హెచ్చరించారు.

**100 శాతం పరిష్కరించాలి**
గత ప్రభుత్వ పాలనలో కొన్ని శాఖల్లో పనితీరు మెరుగ్గా లేకపోవడంతో ప్రజల నుంచి పెద్దఎత్తున అర్జీలు వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అర్జీలను వేగంగా పరిష్కరించి ప్రజలకు సాంత్వన కలిగించాలి. 100 శాతం సమస్యలు పూర్తిగా పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేయాలి. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుంటుపల్లి లాంటి ప్రాంతాల్లో భూ సమస్యల్ని పరిష్కరించాం. రీసర్వే ప్రక్రియ ద్వారా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రతీ నెలా 9న పంపిణీ చేస్తున్నాం. ఇంకా 72 లక్షల పాస్‌పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంది. అర్జీల పరిష్కారం కోసం నిబంధనల్లో మార్పులు తీసుకురావడం, లేదంటే చట్టాలను సవరించే అంశంపై విశ్లేషణ చేయాలి. మెరుగ్గా పనిచేస్తే 15 శాతం వృద్ధిరేటు సాధించే అవకాశం ఉంది. పాలన సులభతరం చేసేందుకు రెవెన్యూ వసూళ్లు పెంచుకునేలా కొన్ని ఏఐ టూల్స్ రూపొందించాం. ఈ ఏడాది వివిధ శాఖల్లో 24 శాతం మేర రెవెన్యూ వసూళ్లు పెరిగాయి. జీఎస్డీపీ వృద్ధిరేటు 2017తో పోలిస్తే గత ఏడాదిలో 20 శాతం మేర పెరిగింది" అని చెప్పారు.

**పెట్టుబడుల స్వర్గంగా ఏపీ**
2019-24 మధ్య అన్ని వ్యవస్థలు ఛిన్నాభిన్నమైపోయాయని... ఇప్పుడు సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కోసం రెండేళ్లుగా సమష్టిగా పనిచేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "ప్రభుత్వ ఆలోచనల్ని అధికార యంత్రాంగం సమర్థంగా అమలు చేసింది. ఆశించిన మార్పులు కొంత వరకు సాధించాం. మరిన్ని రంగాల్లో మరింతగా మెరుగుపడాలి. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపకల్పన చేశాం. గత పాలనలో ఏపీపై పారిశ్రామికవేత్తలకు నమ్మకం పోయింది. ఇప్పుడు మార్పు తెచ్చాం. దేశంలోనే అత్యధిక పెట్టుబడులు ఆకర్షించాం. ఏపీ పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా మారింది" అని వివరించారు.

# షేక్ హసీనా ఢాకాకు తిరిగి వస్తే జైలుకే

మొదటి తరువాయి

రాజకీయ సంకేతాల కోసమేనా?
షేక్ హసీనాను తిరిగి తీసుకొచ్చే ప్రక్రియ తాత్కాలిక ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమైందని, ప్రస్తుతం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్పీ) నేతృత్వంలోని ప్రభుత్వం కూడా అదే ప్రక్రియను కొనసాగిస్తోందని శామా ఒబైద్ తెలిపారు. విదేశాల్లో ఉంటూ తిరిగి వస్తానంటూ హసీనా చేస్తున్న ప్రకటనలు, అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన లేదా దేశం విడిచిన అవామీ లీగ్ నాయకులు, కార్యకర్తల్లో ధైర్యం నింపే ప్రయత్నంగానే కనిపిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. లొంగిపోవడానికి బదులుగా పార్టీ శ్రేణులను ప్రోత్సహించడమే ఆమె వ్యాఖ్యల ఉద్దేశంగా తాను భావిస్తున్నానని తెలిపారు.

# అబద్దాల పునాదులపై పుట్టిందే గొడ్డలి పార్టీ

మొదటి తరువాయి



నిరాశపరిచారని అన్నారు.
విశాఖ సముద్రంలో ప్రకృతి వైపరీత్యం కారణంగా ఆరుగురు మత్స్యకారులు గల్లంతైన ఘటన బాధాకరమని పేర్కొంటూ, సమాచారం అందిన వెంటనే ప్రభుత్వంలోని అన్ని శాఖలను అప్రమత్తం చేసి సహాయక చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేశాయని చెప్పారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన గొర్రెల కాపరి దానయ్య కుటుంబాన్ని పరామర్శించకుండా రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని జగన్‌పై మంత్రి విమర్శలు గుప్పించారు. విశాఖ తీరంలో ప్రమాదం జరిగిన ప్రదేశం పది నాటికల్ మైళ్ల దూరంలో ఉండగా, దానిని పది కిలోమీటర్లలోపే జరిగిందని జగన్మోహన్ రెడ్డి పేర్కొనడం ప్రాథమిక అవగాహన లోపాన్ని సూచిస్తోందని అచ్చెన్నాయుడు అన్నారు. నాటికల్ మైళ్లు, కిలోమీటర్ల మధ్య తేడా తెలియకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయడం విచారకరమని చెప్పారు.
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా సముద్రంలో వేటకు వెళ్లిన 277 మంది మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయినా, అప్పటి ముఖ్యమంత్రి ఒక్క బాధిత కుటుంబాన్ని కూడా పరామర్శించలేదని మంత్రి గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు మత్స్యకారుల పట్ల ప్రేమ చూపించడం రాజకీయ నాటకమేనని వ్యాఖ్యానించారు. విశాఖ ఘటనలో గల్లంతైన వారి ఆచూకీపై స్పష్టత రాకముందే బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించడం ప్రభుత్వం మానవత్వంతో వ్యవహరించినందుకు నిదర్శనమని మంత్రి అన్నారు. ఆ సహాయాన్ని కూడా 'ముష్టి'గా అభివర్ణించడం బాధితులను అవమానించడమేనని పేర్కొన్నారు. ప్రతి మత్స్యకార పడవకు ట్రాన్స్‌పాండర్లు ఏర్పాటు చేసి, అత్యవసర పరిస్థితుల్లో అలారం బటన్ నొక్కగానే ప్రభుత్వానికి సమాచారం చేరే విధంగా ఆధునిక వ్యవస్థను అమలు చేశామని మంత్రి వివరించారు. అయితే ప్రమాదం జరిగిన సమయంలో పడవలో ఉన్నవారు ట్రాన్స్‌పాండరును వినియోగించకపోవడం వల్ల వెంటనే ఆచూకీ లభించలేదని చెప్పారు. ఘటన జరిగిన రోజు తనకు కంటి శస్త్రచికిత్స ఉండటంతో స్వయంగా వెళ్లలేకపోయినా, వెంటనే మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను సంఘటన స్థలానికి పంపించి పరిస్థితిని పర్యవేక్షించామని తెలిపారు

## పాఠశాలలు, కళాశాలల్లో

# లైంగిక విద్యకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

మొదటి తరువాయి

కమిటీ ఎందుకు ఏర్పాటయిందంటే..?
యువత మధ్య పరస్పర అంగీకారంతో ఏర్పడే సంబంధాలు, మైనర్ గర్భధారణలకు సంబంధించిన కేసులు పోక్సో (పోక్సో) చట్టం కింద క్రిమినల్ కేసులుగా మారకుండా నివారించేందుకు తీసుకోవాల్సిన చర్యలను పరిశీలించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. దీంతో మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అదనపు కార్యదర్శి నేతృత్వంలో 26 మంది సభ్యులతో కూడిన జాతీయ నిపుణుల కమిటీని కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి పరస్పర అంగీకారంతో లైంగిక సంబంధాలు కలిగే కౌమారదశ యువత గోప్యతా హక్కులు, పోక్సో చట్టం ప్రభావం వంటి అంశాలను అధ్యయనం చేసే బాధ్యత అప్పగించారు.
కమిటీ చేసిన కీలక సిఫార్సులు ఇవే..
టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్), క్లినికల్ సైకాలజిస్టులు, కేంద్ర మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌పిసిఆర్), నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నాల్సా) ప్రతినిధులు సభ్యులుగా ఉన్న కమిటీ పాఠ్యాంశాల్లో చేర్చాల్సిన పలు కీలక అంశాలు సూచించింది.

## కాపు నేత ముద్రగడ

# కన్నుమూత



మరియు రిజర్వేషన్ల పోరాటం. తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడికి చెందిన ముద్రగడ పద్మనాభం ఆంధ్రా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న సీనియర్ నాయకుడు. కాపు రిజర్వేషన్ పోరాట నాయకుడిగా ఆయన రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధి చెందారు. ముద్రగడ పద్మనాభం తన రాజకీయ జీవితంలో వివిధ పార్టీల్లో పనిచేసి, కీలక పదవులను అలకరించారు. ఎమ్మెల్యేగా ప్రస్థానం: ఆయన తూర్పు గోదావరి జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం నుండి పలుమార్లు శాసనసభ్యుడిగా (ఎమ్మెల్యే) ఎన్నికయ్యారు. (1978, 1983, 1985, 1999 లలో విజయం సాధించారు). మంత్రిగా సేవలు: తెలుగుదేశం పార్టీ హయాంలో నందమూరి తారకరామారావు క్యాబినెట్ లో మరియు ఆ తర్వాత కాలంలో రాష్ట్ర మంత్రిగా పలు కీలక శాఖలను నిర్వహించారు. 1989లో కాకినాడ లోక్‌సభ నియోజకవర్గం నుండి జనతాదళ్ పార్టీ తరఫున పోటీ చేసి ఎంపీగా విజయం సాధించారు.కాపులను బీసీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌తో 2016 జనవరిలో తూర్పు గోదావరి జిల్లా తునిలో ఆయన ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు.

# మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం



**చిట్వేలు, జూలై14(నేటి దర్శిని):**



చిట్వేల్ మండలంలోని నాగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మహిళల చట్టపరమైన హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ, రేణిగుంట డీఎస్పీ ఆదేశాల మేరకు రైల్వే కోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులు పర్యవేక్షణలో చిట్వేల్ ఎస్ఐ ఎస్. వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఐ డి. శ్రీనివాసులు మాట్లాడుతూ మహిళలు, బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112, మహిళల సహాయం కోసం 181, సైబర్ మోసాల ఫిర్యాదుల కోసం 1930 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించాలని వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఖాజా మొహినుద్దీన్, ఏపీఎం చంద్రకళ, ఎంపీహెచ్ఈఓ ధనలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖారాణి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు. సుమారు 200 మందికి పైగా హాజరై అవగాహన పొందారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని జనసైనికుడు మృతి



**చిట్వేలు, జూలై14(నేటి దర్శిని):**



చిట్వేలి మండలం తుమ్మకొండ గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త ఈడిగొట్టు శశిధర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సోమవారం రాత్రి రైల్వే కోడూరు నుంచి మంగంపేట వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ప్రమాద విషయం తెలిసిన వెంటనే రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, టీడీపీ యువ నాయకుడు రాజుకుంట నరసింహ పోస్టుమార్టం జరుగుతున్న ఆసుపత్రికి చేరుకుని మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ శశిధర్ కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని, ఆయన ఇద్దరు చిన్నారుల భవిష్యత్తుకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాదాసు నరసింహ, శివప్రసాద్ రాజు, మద్దూరి మన్మధ, తుమ్మకొండ చిరంజీవి, తుమ్మకొండ మనోహర్, పెద్దంగారి సాయి, మాదినేని రాజా, పవన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలను నిరూధించడం ప్రజలందరి బాధ్యత



**కాకినాడ,జూలై14(నేటి దర్శిని):**

కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరంగి గ్రామంలో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు,ప్రజా ప్రచార కార్యక్రమాలు,వీధి నాటకాలు ద్వారా మహిళా చట్టాలు,హక్కులను గూర్చి,బాల్య వివాహాలు మరియు కౌమార గర్భాలను గూర్చి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.కాకినాడకు చెందిన పవన్ కుమార్ కళాజాతా బృందం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు,జానపద గీతాలు మరియు వీధి నాటకాలను ప్రదర్శించారు. బాల్య వివాహాల వల్ల సరియైన చదువు లేక,సరిపోయే సంపాదన లేక కలిగే ఇబ్బందులను గూర్చి,కౌమార గర్భాల వలన సంభవించే కష్టాలను గురించి సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీమాబాయి మహిళా మండలి చీఫ్ ఫంక్షనరీ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ బాల్యవివాహాలను నిరోధించడం ప్రజలందరి బాధ్యత అన్నారు. ఈ సందర్భంగా మహిళా చట్టాలు మరియు హక్కులను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బీమాబాయి మహిళా మండలి కమ్యూనిటీ ఆర్గనైజర్లు వరలక్ష్మీ,దేవి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డ మాజీ శాసనసభ్యులు గంగుల బిజేంద్ర రెడ్డి కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు

**-వైసీపీ నేతలు ముడిమేళ నాగరాజు,ముడి మేళ సందీప్ కుమార్.**

**శిరివెళ్ళ. జూలై14(నేటి దర్శిని):**



ఆళ్లగడ్డ అసెంబ్లీ మాజీ శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు, వైసీపీ నేతలు,మూడిమేళ నాగరాజు, ముడిమేళ సందీప్ కుమార్ లు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంగుల నాని దేవుని ఆశీస్సులు ప్రజల దీవెనలతో నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలు రాజభోగాలతో తులతూగాలని తిరిగి ప్రజాప్రతినిధిగా ఎన్నికై ప్రజాసేవే పరామావదిగా చేస్తూ ఎన్నో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని మనస్ఫూర్తిగా దేవుని ప్రార్థిస్తున్నట్టు వారు తెలిపారు.

# సర్ ప్రక్రియలో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన ముమ్మిడివరం నగర పంచాయతీ

**కోనసీమ,జూలై14(నేటి దర్శిని):**




సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ) ఓటరు ఎన్యుమరేషన్ ఫారాలు డిజిటలైజేషన్ నూరు శాతం పూర్తి చేసి డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోనే ముమ్మిడివరం నగర పంచాయతి ప్రథమస్థానం సాధించిందని కమిషనర్ పి.రవి వర్మ తెలిపారు. ఈ ఘనత సాధించడంలో జిల్లా కలెక్టర్ ఆదేశములతో ఆర్డీవో పర్యవేక్షణలో నిరంతరం ఏ ఈ ఆర్ వో లు, పి.రవివర్మ, కె.శ్రీనివాసు, బి., రాజేష్ బాబు, ఎలక్షన్ సూపర్ వైజర్లు జి. సూర్య సునీత, కె. ప్రసన్న వదన్, బి ఎల్ వో లు, ఆపరేటర్లు, నగర పంచాయతి, మెప్మా సిబ్బంది సమయాభావం లేకుండా పనిచేయడం వలన లక్ష్యాన్ని జూలై 14 తేదీ గడువు ముందుగానే పూర్తి చేసామని కమిషనర్ వివరించారు. 100 శాతం మొదటిగా (1) 13 వ పి.ఎస్. బి ఎల్ ఓ సుంకర శ్రీలక్ష్మి, వార్డు మహిళా పోలీస్, (2) 21 వ పి.ఎస్. బి ఎల్ ఓ రెడ్డి సువర్ణ లక్ష్మి, వార్డు మహిళా పోలీస్, (3) 20వ పి.ఎస్. బి ఎల్ ఓ బద్రి దుర్గా అమ్మాజీ, వార్డు మహిళా పోలీస్, (4) 55 వ పి.ఎస్. బి ఎల్ ఓ ఆర్.మోహనరావు, వీఆర్వో, (5) 28 వ పి.ఎస్. బి ఎల్ ఓ, సంగాడి లోవ, వార్డు మహిళా పోలీస్ సాధించారని ప్రశంసించారు. వీరిని మరియు ఏ ఈ ఆర్ వో లు, ఎన్నికల పర్యవేక్షకులను, ఎలక్షన్ ఆపరేటర్ ను కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సర్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతీ ఒక్కరూ టీం వర్క్ గా కష్టపడి పనిచేయడం వల్లే సాధ్యపడిందని ఈ సందర్భంగా సిబ్బందికి, బి ఎల్ ఏ లకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

# శిరివెళ్లలో ఎస్ఐఆర్ 100% పూర్తి తహసిల్దార్ .




**శిరివెళ్ళజూలై14(నేటి దర్శిని):**

భారత ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు. శిరివెళ్ల మండలంలో ఎస్ ఐ ఆర్ ప్రక్రియను నేటితో 100% పూర్తి చేసినట్లు తహసిల్దార్ ఐ విజయశ్రీ పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా బిఎల్ సూపర్వైజర్లు ఇతర సిబ్బంది ద్వారా అధిక సమయం వెచ్చించి ప్రభుత్వం ఆదేశించిన నిర్నిత గడువులోగా 100% పూర్తి చేశామన్నారు మండల పరిధిలో 62 పోలింగ్ కేంద్రాలు 62 మంది బిఎల్వోలు ఏడు మంది సూపర్వైజర్ల ద్వారా టార్గెట్ రీచ్ కావడానికి విశేష కృషి చేసినట్లు తహసిల్దార్ పేర్కొన్నారు. శిరివెళ్ల మండల వ్యాప్తంగా మొత్తం 48,116 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు.బీఎల్ఓ ల ఇంటింటి సందర్శన జూలై 24, 2026 వరకు పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణ: జూలై 24, 2026 నాటికి పూర్తి చేయాలన్నారు.ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ జూలై 31, 2026 న విడుదలచేస్తామన్నారు.క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల దాఖలు జూలై 31, 2026 నుండి ఆగస్టు 30, 2026 వరకు గడువు క్లెయిమ్‌లు అభ్యంతరాల పరిష్కారం సెప్టెంబర్ 28, 2026 లోపూ తుది ఓటర్ల జాబితా ప్రచురణ అక్టోబర్ 3, 2026 ఉంటుందని ఈ సందర్భంగా తహసిల్దార్ విజయశ్రీ పేర్కొన్నారు.

# చిన్నారుల భద్రతకు శక్తి టీం అవగాహన

**గుడ్ టచ్--బ్యాడ్ టచ్, 112, శక్తి యాప్‌పై విద్యార్థులకు వివరాలు**

**నందికొట్కూరు,జూలై14(నేటి దర్శిని):**



చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షియోరాన్ ప్రత్యేక చొరవతో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ ఆదేశాల మేరకు ఆత్మకూరు సబ్‌డివిజన్ శక్తి టీం సభ్యులు మంగళవారం నందికొట్కూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గుడ్ టచ్--బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ రెడ్డి అనుమతితో, ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు సమక్షంలో 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాను సులభంగా అర్థమయ్యేలా వివరించారు. అపరిచితులు చాక్లెట్లు, బిస్కెట్లు, బొమ్మలు ఇస్తామని చెప్పి దగ్గరకు పిలిచినా వెళ్లవద్దని, వెంటనే ఉపాధ్యాయులు లేదా తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం పాఠశాల సిబ్బందికి శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసి, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం లేదా అత్యవసర పరిస్థితుల్లో ఫొటోలు, లొకేషన్‌తో పోలీసులకు ఎలా పంపించాలో వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేస్తే తక్షణమే పోలీసు సహాయం అందుతుందని తెలిపారు. చిన్నారులపై జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రతి పాఠశాలలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న పోలీసు శాఖ చొరవను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానికులు అభినందించారు. ఎస్పీ సునీల్ షియోరాన్ చేపట్టిన ఈ కార్యక్రమం చిన్నారుల్లో అప్రమత్తత పెంచడంలో ఉపయోగపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.

# సిద్దేశ్వరాలయంలో అన్నదాన కార్యక్రమం

**జహీరాబాద్, జూలై14(నేటి దర్శిని):**

జహీరాబాద్ పట్టణం అల్గోల్ రోడ్డు లోని శ్రీ సిద్దేశ్వరాలయంలో ఆషాడ మాసం అమావాస్య సందర్బంగా సందర్భంగా స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు సంగమేశ్వర్ స్వామి రుద్రాభిషేకం, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్బంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో ప్రతి అమావాస్య తో పాటు ప్రతి సోమవారం అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు సంగమేశ్వర్ స్వామి పేర్కొన్నారు. కుంకుమార్చన కార్యక్రమం లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమం లో ఆలయ కమిటీ, ఆలయ కార్యనిర్వహణ అధికారి శివరుద్రప్ప, శివశక్తి సంఘం బాధ్యులు సూదాం వెంకట్, గాల్ రెడ్డి, శంకర్, ఎన్నం రఘు, మధుమాలా, అమర్ నాథ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా మంగళవారం నాడు ఆషాడ అమావాస్య సందర్భంగా స్వామి వారికి విశిష్ట పూజా క్రతువులు నిర్వహించారు

# అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీరను భ్రమరాంబిక అమ్మవారికి సమర్పణ

**-వారం రోజుల పాటు మగ్గంపై నేసిన అరుదైన చేనేత కళాఖండం.. సిరిసిల్ల కళాకారుడు విజయ్ కుమార్ అద్భుత సృష్టికి ప్రశంసలు**



**నంద్యాల,జూలై14(నేటి దర్శిని):**

: అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైలం శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి అమ్మవారికి అగ్గిపెట్టెలో ఇమిడిపోయే అరుదైన చేనేత పట్టుచీరను మంగళవారం సమర్పించారు. ఈ ప్రత్యేక పట్టుచీరను తెలంగాణ రాష్ట్రంలోని సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారుడు, కళారత్న నల్ల విజయ్ కుమార్ దేవస్థానానికి అందజేశారు. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు ఈ ప్రత్యేక పట్టుచీరను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యురాలు కోడె కాంతివర్ధిని కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ, తన కుటుంబ సభ్యులతో కలిసి వారం రోజుల పాటు మగ్గంపై శ్రమించి ఈ ప్రత్యేక పట్టుచీరను రూపొందించినట్లు తెలిపారు. చీర పొడవు 5.5 మీటర్లు, వెడల్పు 48 అంగుళాలు కాగా, బరువు సుమారు 200 గ్రాములు మాత్రమే ఉంటుందన్నారు. సంప్రదాయ ఇక్కత్ నమూనాలో రూపొందించిన ఈ పట్టుచీరను ప్రత్యేక పద్ధతిలో మడతపెడితే చిన్న అగ్గిపెట్టెలో సైతం సులభంగా ఇమిడిపోతుందని వివరించారు. శ్రీ భ్రమరాంబిక అమ్మవారి అనుగ్రహంతోనే ఈ అరుదైన కళాఖండాన్ని రూపొందించగలిగినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు విజయ్ కుమార్ ప్రతిభను అభినందించారు. చేనేత కళాకారుల అపూర్వ నైపుణ్యానికి ఈ పట్టుచీర నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. భారతీయ సంస్కృతిలో చేనేతకు ప్రత్యేక స్థానం ఉందని, అది కేవలం ఒక వృత్తి మాత్రమే కాకుండా తరతరాలుగా వస్తున్న గొప్ప కళ అని పేర్కొన్నారు. చేనేత వస్త్రాలు కళాకారుల సృజనాత్మకత, నైపుణ్యం, అంకితభావానికి ప్రతీకలని చెప్పారు. ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ఆదరించి ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

# రాకా'లో మరో హీరోయిన్ ఫిక్స్..

## అల్లు అర్జున్ సినిమాపై అంచనాలు పెంచిన నైలా గ్రేవల్ !




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ పాన్-వరల్డ్ చిత్రం 'రాకా' పై ఇప్పటికే సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. సైన్స్ ఫిక్షన్, యాక్షన్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ సినిమా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉండగా, చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతోంది. ఇప్పటికే ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె కథానాయికగా నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అయితే, ఈ సినిమాలో ఒకరికి మించి పలువురు హీరోయిన్లు కనిపించనున్నారనే ప్రచారం గత కొంతకాలంగా సాగుతోంది. మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్, రష్మిక మందన్న వంటి పలువురు స్టార్ హీరోయిన్ల పేర్లు కూడా వినిపించాయి.ఇటీవల మలయాళ నటి ఫెమినా జార్జ్ తాను కూడా 'రాకా'లో కీలక పాత్ర పోషిస్తున్నట్లు వెల్లడించగా, ఇప్పుడు మరో కొత్త పేరు ఈ ప్రాజెక్ట్‌లో చేరింది. పంజాబీ నటి నైలా గ్రేవల్ కూడా ఈ సినిమాలో నటిస్తున్నట్లు అధికారికంగా వెల్లడించింది.తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన నైలా గ్రేవల్, "దర్శకుడు అట్లీతో పని చేయాలని చాలా కాలంగా కోరుకుంటున్నాను. ఇప్పుడు ఆ అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉంది. బాలీవుడ్‌లో మాత్రమే పనిచేసిన నన్ను ఇలాంటి భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు ఎంపిక చేయడం గౌరవంగా భావిస్తున్నాను. 'రాకా'లో భాగమవడం నా కెరీర్‌లో ప్రత్యేకమైన మైలురాయి" అని చెప్పింది. నైలా గ్రేవల్ ఇప్పటికే 'తమాషా', 'బరేలీ కి బర్ఫీ', 'తప్పడ్', 'ఇష్క్ విశ్క్ రీబౌండ్' వంటి హిందీ చిత్రాల్లో నటించి గుర్తింపు పొందింది. అలాగే ఓ ప్రముఖ నెట్‌ఫ్లిక్స్ వెబ్ సిరీస్‌లోనూ మెప్పించింది. ఇప్పుడు అల్లు అర్జున్ నటిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో ఆమె కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తోంది. 'రాకా'లో పలువురు నటీనటులు భాగమవుతున్న నేపథ్యంలో సినిమా కథ, పాత్రలపై ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. అట్లీ తన మార్క్ కమర్షియల్ ఎలిమెంట్స్‌కు సైన్స్ ఫిక్షన్ టచ్ జోడిస్తూ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారని సమాచారం. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా కొనసాగుతుండగా, మిగిలిన నటీనటులు, కథకు సంబంధించిన వివరాలను మేకర్స్ దశలవారీగా అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. అల్లు అర్జున్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం విడుదలకు ముందే దేశవ్యాప్తంగా భారీ హైప్‌ను సొంతం చేసుకుంటోంది.



## దివ్య భారతి గ్లామర్ షో

# 'లెనిన్'జోరు ..

## నాలుగు రోజుల్లో ఎంత వసూలు చేసింది అంటే..!




ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటి నుంచి అఖిల్ అక్కినేని నటించిన 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. తొలి మూడు రోజుల్లోనే రికార్డు స్థాయి వసూళ్లు సాధించిన ఈ చిత్రం.. నాలుగో రోజు కలెక్షన్లలో మాత్రం సహజమైన డ్రాప్‌ను నమోదు చేసింది. అయినప్పటికీ మొత్తం వసూళ్ల పరంగా దూసుకెళ్తూ అఖిల్ కెరీర్‌లోనే అతిపెద్ద కమర్షియల్ హిట్‌గా నిలిచే దిశగా అడుగులు వేస్తోంది. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో అఖిల్ పవర్‌ఫుల్ యాక్షన్, భాగ్యశ్రీ బోర్సే నటన, ఎస్. థమన్ అందించిన సంగీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా మాస్ సెంటర్లలో సినిమాకు మంచి ఆదరణ లభిస్తుండటంతో విడుదలైన తొలి రోజు నుంచే కలెక్షన్ల పరంగా దూసుకుపోతోంది.మొదటి రోజే ప్రపంచవ్యాప్తంగా రూ.16.7 కోట్ల గ్రాస్ వసూలు చేసి అఖిల్ కెరీర్‌లోనే అత్యుత్తమ ఓపెనింగ్స్ నమోదు చేసిన ఈ చిత్రం, వీకెండ్ ముగిసే సమయానికి మూడు రోజుల్లో రూ.61.1 కోట్ల గ్రాస్ సాధించి సంచలనం సృష్టించింది. ఈ జోరుతో డిస్ట్రిబ్యూటర్ల పెట్టుబడులు కూడా వేగంగా రికవరీ అవుతున్నాయని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. వీకెండ్ తర్వాత వచ్చే సోమవారం దాదాపు అన్ని సినిమాల కలెక్షన్లు తగ్గడం సాధారణమే. అదే పరిస్థితి 'లెనిన్'కు కూడా ఎదురైంది. అడ్వాన్స్ బుకింగ్స్ పరంగా మంచి స్పందన కనిపించినప్పటికీ, నాలుగో రోజు ప్రపంచవ్యాప్తంగా సినిమా రూ.6.1 కోట్ల గ్రాస్ మాత్రమే రాబట్టింది.వీశీజఅవం దీంతో నాలుగు రోజుల ముగింపుకు ఈ చిత్రం మొత్తం రూ.67.2 కోట్ల వరల్డ్‌వైడ్ గ్రాస్ వసూలు చేసినట్లు నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో, కేవలం నాలుగు రోజుల్లో రూ.67.2 కోట్ల గ్రాస్‌తో బ్లాక్‌బస్టర్ ప్రయాణం కొనసాగుతోంది అంటూ మేకర్స్ ఆనందం వ్యక్తం చేశారు. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద పెద్దగా పోటీ సినిమాలు లేకపోవడం 'లెనిన్'కు కలిసొచ్చే అంశంగా కనిపిస్తోంది. మరోవైపు పాజిటివ్ మౌత్ టాక్ కూడా సినిమాకు బలంగా నిలుస్తోంది. అయితే వీకెండ్‌తో పోలిస్తే సోమవారం కలెక్షన్లు గణనీయంగా తగ్గడం ట్రేడ్ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఇక రాబోయే రోజుల్లో వసూళ్లు నిలకడగా కొనసాగితే రూ.100 కోట్ల వరల్డ్‌వైడ్ గ్రాస్ క్లబ్ చేరడం పెద్ద కష్టమేమీ కాదని, లేదంటే ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.




# రామ్ చరణ్-సుకుమార్ సినిమాలో నయనతార..

## పవర్‌ఫుల్ పాత్రలో లేడీ సూపర్ స్టార్?

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న RC17' చిత్రంపై అంచనాలు రోజురోజుకూ ఆకాశాన్ని తాకుతున్నాయి. 'రంగస్థలం' వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో వరల్డ్ వైడ్‌గా ఈ ప్రాజెక్ట్‌పై భారీ హైప్ క్రియేట్ అయింది. అయితే ఇప్పటివరకు ఈ సినిమాలో హీరోయిన్ ఎవరు అనే విషయంపై మేకర్స్ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఈ తరుణంలో ఈ సినిమా కాస్టింగ్ గురించి సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన ప్రచారం జోరందుకుంది. లేడీ సూపర్ స్టార్ నయనతార ఈ చిత్రంలో భాగం కానున్నట్లు టాలీవుడ్ వర్గాల్లో బలంగా టాక్ వినిపిస్తోంది. అయితే ఆమె ఈ సినిమాలో కథానాయికగా కాకుండా, కథను మలుపు తిప్పే ఒక కీలకమైన, ఎంతో ప్రాధాన్యత కలిగిన పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం.సాధారణంగా దర్శకుడు సుకుమార్ రాసుకునే ప్రతి పాత్రకు ఒక బలమైన గుర్తింపు, ప్రాముఖ్యత ఉంటాయి. 'రంగస్థలం' చిత్రంలో ప్రతి క్యారెక్టర్‌ను అద్భుతంగా డిజైన్ చేసిన సుకుమార్.. RC17'లో కూడా నయనతార కోసం ఒక పవర్‌ఫుల్ రోల్‌ను సిద్ధం చేశారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఇదే నిజమైతే, నయన్ రాకతో ఈ ప్రాజెక్ట్‌కు మరింత క్రేజ్ రావడం ఖాయం. మరోవైపు, తెలంగాణ నేపథ్యంలో సాగే పక్కా రూటెడ్ నేటివిటీ స్టోరీగా ఈ సినిమా తెరకెక్కనుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో నయనతార పాత్రపై వస్తున్న వార్తల్లో ఎంతవరకు నిజముందో తెలియాలంటే చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# 'తుంబాడ్ 2' లోకి ఆలియా భట్.. క్రేజీ అప్‌డేట్‌తో సోషల్ మీడియా షేక్!



భారతీయ చలనచిత్ర రంగంలో అద్భుతమైన విజువల్స్, అద్భుతమైన కథాంశంతో కల్ట్ క్లాసిక్‌గా నిలిచిన హారర్ థ్రిల్లర్ చిత్రం 'తుంబాడ్' (ఏబఎఎమ్బఏ). ఈ సినిమా సీక్వెల్ 'తుంబాడ్ 2' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా, ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించి చిత్ర పరిశ్రమలో ఒక భారీ సంచలన అప్‌డేట్ వెలువడింది. బాలీవుడ్ స్టార్ నటి ఆలియా భట్ అధికారికంగా 'తుంబాడ్ 2' చిత్రబృందంలో చేరింది. ఈ విషయాన్ని సినిమా హీరో మరియు నిర్మాత సోహుమ్ షా సోషల్ మీడియా వేదికగా అధికారికంగా వెల్లడిస్తూ ఆలియాకు ఘన స్వాగతం పలికారు. ఒక సరికొత్త అధ్యాయం మొదలైంది.. 'తుంబాడ్ 2' లోకి స్వాగతం ఆలియా భట్. ప్రళయం రాబోతోంది" అంటూ సోహుమ్ షా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఆలియాతో దిగిన ఫోటోలను పంచుకున్నారు. ఈ సినిమాలో భాగం కావడంపై ఆలియా భట్ సైతం హర్షం వ్యక్తం చేసింది. తాను మొదటిసారి 'తుంబాడ్' చూసినప్పటి నుంచి ఆ చిత్రం తన మనసులోనే ఉండిపోయిందని, ఇంతటి ప్రత్యేకమైన ప్రపంచంలోకి అడుగుపెట్టడం చాలా సంతోషంగా ఉందని ఆమె పేర్కొంది. సోహుమ్ షా, నవాజుద్దీన్ సిద్ధిఖీ వంటి అద్భుతమైన నటులతో కలిసి పనిచేయడానికి తాను ఎంతగానో ఎదురుచూస్తున్నట్లు తెలిపిందిఇక 'తుంబాడ్ 2' లో ఆలియా భట్ పాత్ర కేవలం అతిథి పాత్రగా కాకుండా కథను మలుపు తిప్పే కీలకమైన రోల్‌గా ఉండబోతోంది. దాదాపు రూ.100 కోట్ల భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సీక్వెల్‌కు ఆదేశ్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రం డిసెంబర్ 3, 2027న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# నాగచైతన్య కొత్త సినిమా?



ప్రస్తుతం అగ్ర కథానాయకుడు అక్కినేని నాగచైతన్య 'వృషకర్మ' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. ఈ సినిమా తర్వాత చేయాల్సిన ప్రాజెక్ట్‌ని కూడా నాగచైతన్య ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. 'బెదురులంక 2012' చిత్రం ద్వారా గుర్తింపు తెచ్చుకున్న క్లాక్స్ దర్శకత్వంలో ఆయన తర్వాత సినిమా ఉంటుంది.ఈ సినిమాను ఈ ఏడాది చివర్లో సెట్స్ పైకి తీసుకెళ్లే యోచనలో చైతూ ఉన్నారు. ఇదిలావుంటే.. ఈ క్రమంలోనే 'మసూద' దర్శకుడు సాయికిరణ్ కూడా ఇటీవలే చైతూకి కథ వినిపించారట. తన తొలి సినిమా 'మసూద'తో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న సాయికిరణ్, గత రెండేళ్లుగా ఓ హారర్ థ్రిల్లర్ స్క్రిప్ట్‌పై వర్క్ చేశారు. ఏషియన్ సునీల్ నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ కోసమే చైతూని సాయికిరణ్ కలిసినట్టు, కథ వినిపించినట్టు తెలిసింది. అన్నీ కుదిరితే వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్‌పైకెళ్లే అవకాశం ఉన్నది.

Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, Krishna, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450